సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం, 26, ఆగస్టు, 2025



మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సోమవారం సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. - 8లో



హత్య కేసులో నిందితుడి అరెస్టు

మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.440
రెండోరకం	రూ.200	రూ.320



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	642
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 367.140 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుకు నేడు చివరి తేదీ

రాజంపేట : రాజంపేట అబ్కారీశాఖ పరిధిలో రెండు బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం చివరి రోజని రాజంపేట అబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక తెలిపారు. సోమవారం ఇక్కడ మాట్లాడుతూ చివరి రోజున డీడీల రూపంలో బ్యాంకుల ద్వారా, డిపాజిట్ చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

28 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

రాయచోటి జగదాంబసెంటర్ : ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28వ తేదీ నుంచి సంబంధిత జిల్లాల్లోనే ప్రారంభమవుతుందని మెగా డీఎస్సీ–2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ఐడీల ద్వారా ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ఒక రైతుకు ఒక బస్తా



మదనపల్లెలో క్యూలో నిలుచున్న రైతులు

మదనపల్లె : మదనపల్లెలో యూరియా కోసం వచ్చిన రైతులకు వ్యవసాయశాఖ అధికారులు ఒక రైతుకు ఒక బస్తాను పంపిణీ చేయాలని డీలర్లను కోరారు. సోమవారం మదనపల్లె ఎరువుల దుకాణాల వద్ద రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో బస్తా యూరియా కోసం క్యూలో నిలబడి తీసుకెళ్లారు. రైతులకు అవసరమైనంత యూరియా ఉందని, అయితే ఒకేసారి తీసుకువెళ్లడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వ్యవసాయశాఖ ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఒక పంటకు ఒక విడతకు ఒక బస్తా యూరియా సరిపోతుందని చెప్పారు.

ఉపాధ్యాయుల బదిలీ అర్హత నిబంధన సవరణ

రాయచోటి జగదాంబసెంటర్ : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల అర్హత నిబంధనలలో సవరణలు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు కనీసం 2 సంవత్సరాల సేవ పూర్తి చేయాలనే షరతు మినహాయించినట్లు, ఈ నేపథ్యంలో సేవా పరిమితి అవసరం లేదన్నారు. అదే విధంగా వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న పరస్పర మార్పిడి బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వారికి 31.07.2027లోపు పదవీవిరమణ పొందబోయే వారు అంతర్ జిల్లా బదిలీలకు అర్హులు కారని గమనించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 24 నుంచి 27వ తేదీల వరకు, ఎంఈఓ వెరిఫికేషన్ ఈ నెల 25 నుంచి 28 వరకు, డీఈఓ వెరిఫికేషన్ ఈ నెల 26 నుంచి 29 వరకు, పాఠశాల విద్య డైరెక్టర్‌కు సమర్పణ ఈ నెల 30 నుంచి 31వ తేదీ వరకు, డైరెక్టర్ కార్యాలయ పరిశీలన సెప్టెంబర్ 1 నుండి 2వ తేదీ వరకు ఉంటుందని డీఈఓ తెలియజేశారు.

ఆందోళనలు.. ఆర్తనాదాలు

కూటమి సర్కార్ పాలనా పగ్గాలు చేపట్టిన రోజు నుంచి ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు., పాలనా వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని, ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చంద్రబాబు సర్కార్‌పై గ్రామగ్రామాన ప్రజలు రగిలిపోతున్నారు.తాము అధికారంలోకి వస్తే పెన్షన్ పెంచుతామన్న చంద్రబాబు ఇప్పుడు అంధులు,, దివ్యాంగులు ఆర్తనాదాలు పెట్టేలా చేస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగుల జేఏసీ నాయకులు



జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- చంద్రబాబూ మాపై ఎందుకు కక్ష
- కలెక్టర్ కార్యాలయం ఎదుట నినదించిన దివ్యాంగులు.
- కలెక్టర్‌కు వినతుల సమర్పణ

రాయచోటి టౌన్ : అయ్యా చంద్రబాబూ మాపై కోపం ఎందుకంటూ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హత పేరుతో అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ దివ్యాంగుల సంఘం నాయకులు, వికలాంగులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం దివ్యాంగుల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.

దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో పర్సెంటేజీ లను తగ్గించి, ఉన్న పెన్షన్లను తొలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదురుగా రెండు గంటలకు పైగా ఆందోళనను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పట్ల అవలంబిస్తున్న వైఖరిని తప్పుపట్టారు. అర్హత లేని వారిని తొలగించినా ఫర్వాలేదు కానీ, అర్హత ఉండి రాజకీయాల పేరుతో పెన్షన్లను తొలగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తమ గోడు వినేందుకు కలెక్టర్ తమ దగ్గరకు రావాలని దివ్యాంగులు పట్టుబట్టారు. ఫిర్యాదుల స్వీకరణ తరువాత కలెక్టర్ దివ్యాంగులను తన దగ్గరకు పలిపించుకొని వారి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.

న్యాయం చేయాలి



నా పేరు లక్ష్మీ లావణ్య. కలకడ కోన. 2020 నుంచి పెన్షన్ వస్తోంది. వికలత్వ పర్సెంటేజ్ 73 శాతం ఉంది. అలాంటిది ఇప్పుడు నేను అనర్హురాలునని చెబుతున్నారు. ఇన్ని రోజులు ఉన్న వికలత్వం ఇప్పుడు ఎలా పోయిందో అధికారులే చెప్పాలి. న్యాయం చేయాలి

దిక్కుతోచడం లేదు



నా పేరు శివ. 2015 నుంచి పెన్షన్ వస్తోంది. నా వికలత్వం పర్సెంటేజీ 64 శాతం ఉంది. అలాంటిది ఇప్పుడు పర్సెంటేజీ తగ్గించారు. ఫించన్ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాను. ఫెన్షన్ రాదని చెబుతున్నారు.ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. కూటమి ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ చేయాలి. పరిశీలన చేసే డాక్టర్లను విచారించి మాకు న్యాయం చేయాలి.

పింఛన్ రాదంటున్నారు



నా పేరు గున్నామంతి బాలాజీ. నాకు 87 శాతం వికలత్వం ఉంది. ఒకరి సాయం లేకుండా నడవలేను. అందుకే నాకు రూ.200 పించన్ ఇస్తున్నప్పటి నుంచి డబ్బులు వచ్చేవి. ఇప్పుడు రూ.6వేలు వచ్చేది. అదే జీవనాధారం. అలాంటిది ఇప్పుడు నేను వికలాంగుడిని కాదంట.. పెన్షన్ రాదని చెబుతున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా తొలగించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వెరిఫికేషన్ పేరుతో ఉన్న వాటిని తొలగిస్తున్నారు. అర్హత ఉంటేనే ఇన్ని రోజులు ఇచ్చింది. అలాంటిది ఇప్పుడు పరిశీలన పేరుతో తొలగించడం సరికాదు.

దివ్యాంగులపై కోపం తగదు చంద్రబాబు



చంద్రబాబు మోసపూరిత మాటలతో దివ్యాంగుల ఓట్లు వేయించుకొని ఇప్పుడు ఆయన అసలు రూపం చూపిస్తున్నాడు. పరిశీలన పేరుతో ఉన్న పెన్షన్లను తొలిగించడం ఎంత వరకు న్యాయం.. ఇప్పటికే నాలుగైదు లక్షల మందికి పెన్షన్లను తొలిగించారు. ఇంకా తొలగించే ప్రక్రియ జరుగుతోంది. ఇలా ఎన్నికలకు ముందు ఒక మాట.. అధికారం వచ్చాక మరో మాట మాట్లాడటం చంద్రబాబుకు మామూలే అని మరోసారి నిరూపితమైంది.

– రహమాన్ ఖాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ

అన్యాయం చేస్తే ఊరుకోం



దివ్యాంగులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు. చూడగానే వైకల్యం కనిపిస్తున్నా దివ్యాంగులని అనిపించకపోవడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ల ఏరివేతకు ప్రాధాన్యమిచ్చింది. పరిశీలన పేరుతో వికలాంగులను వేధించడం మానుకోవాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల దివ్యాంగుల సంఘాల నాయకులతో ఆందోళనలు చేపడతాం.

– ఖలీల్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం సుండుపల్లె అధ్యక్షుడు

‘భాగ్యలక్ష్మి’ సందడి



మదనపల్లె : స్థానిక సీటీఎం రోడ్డులో చందన షాపింగ్ మాల్ ను సినీనటి ఐశ్వర్య రాజేష్, బాల నటుడు రేవంత్ (బుల్లి రాజు) చేతుల మీదుగా సోమవారం ప్రారంభమైంది. స్థానికులు, అభిమానులు హాజరై సందడి చేశారు.ఇక్కడి వారి ఆత్మీయత, ఆదరణ మరువలేనిదన్నారు. తొలి రోజే వందల మంది షాపింగ్ ప్రియులు ఆసక్తితో కావాల్సిన వాటిని బంపర్ ఆఫర్లతో కొనుగోలు చేసి సంబరపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, డి.రమేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మునిసిపల్ చైర్మన్ మనూజా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గురుచరణ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

పెనగలూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చక్రంపేట విద్యార్థి సి గురుచరణ్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ తెలిపారు. ఈనెల 24వ తేదీ రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గురు చరణ్ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఈనెలాఖరులో ప్రకాశం జిల్లా చేపూరులో జరుగు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థికి ఉపాధ్యాయులు హరిప్రసాద్, అన్వర్‌బాష, పిఎల్ఎన్ ప్రసాద్, కృష్ణకుమారి, ప్రమీల, పరిమళ, శ్రీవాణి, మహేంద్ర, సుదర్శనం, శివ,నరసింహులు, ఎల్ ప్రసాద్, సతీష్ బాబు అభినందనలు తెలియజేశారు.

ఒంటిమిట్ట రామాలయంలో పవిత్రాల సమర్పణ



పవిత్రాలను తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా సోమవారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా సీతారామలక్ష్మణుల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ఉదయం బాలబోగం, చతుష్టార్చన, పవిత్రహోమం, మధ్యాహ్నం ఆరాధన, శాత్తుమొర, తీర్థప్రసాద గోష్టి చేపట్టారు. అనంతరం ఉదయం 9 గంటలకు శ్రీ సీతాసమేత శ్రీ కోదండరామస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నపనమూర్తులకు, విశ్వక్సేనులవారికి, ధ్వజస్తంభానికి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామివారికి పవిత్రాలు సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శ్రీమతి ప్రశాంతి, సూపరిటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్ : వినాయక చవితి పండుగలో ప్రజలు మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌తో కలిసి గణేష్ నవరాత్రి వేళ పర్యావరణహిత మట్టి విగ్రహాలు వినియోగంపై కలెక్టర్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడటం వల్ల చెరువులు, నదులు కాలుష్యం అవుతున్నాయన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ తదితరులు

సమస్యలకు సత్వర పరిష్కారం

రాయచోటి టౌన్ : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.

శాంతియుతంగా వినాయక చవితి జరుపుకోవాలి:జేసీ

రాయచోటి : వినాయక చవితి పండుగ సామరస్యానికి ప్రతీక అని, పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా సంబంధిత అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలతో కలిసి జాయింట్ కలెక్టర్ శాంతియుత కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజలు శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని జేసీ సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలు ఉపయోగించకుండా మట్టి వినాయకులను ప్రోత్సహించాలని నిర్వాహకులను కోరారు. నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, రక్షణ బృందాలు వంటి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు,మతపెద్దలు పాల్గొన్నారు.

బోర్డులు పీకేసి..భూములపై కన్నేసి

- ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాకు అక్రమార్కుల యత్నాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు





గుర్రంకొండ మండలం చిట్టిబోయనపల్లె ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు నాటుతున్న రెవెన్యూ అధికారులు, బోర్డు తొలగించిన దృశ్యం

గుర్రంకొండ : విలువైన ప్రభుత్వం భూములపై అక్రమార్కుల కన్ను పడింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వాలిపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు స్థలాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఆ తరువాత అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను అక్రమార్కులు మాయం చేస్తూ.. కబ్జాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకొన్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.

జిల్లాలోని గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం పక్కనే ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి సమీపంలో కోట్లాది రుపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు ఉన్నాయి. సర్వేనంబర్ 87/8లో రెండు ఎకరాల భూమికి సంబంధించి ఇంతవరకు ఎవ్వరికీ పట్టా ఇవ్వలేదు. ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగిపోయింది. ఎకరం రూ.2 కోట్ల వరకు ఉంది. దీంతో కొంతమంది కబ్జాదారుల కన్ను ఈ భూమిపై పడింది. దీనిని సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. రెవెన్యూ అధికారులు సదరు భూమిని కబ్జాదారుల నుంచి కాపాడుకోవడానికి సర్వే పనులు చేపట్టారు. జేసీబీతో సరిహద్దుల వద్ద కందకాలు తవ్విస్తుండగా వాటిని కొంతమంది కూటమినేతలు అడ్డుకుని రెవెన్యూ అధికారులను అక్కడి నుంచి పంపించేసిన సంఘటనలు ఉన్నాయి. కొన్నాళ్లుగా గుంభనంగా ఉన్న కబ్జాదారులు అప్పట్లో మళ్లీ కబ్జా ప్రయత్నాలు తిరిగి ప్రారంభించారు. ఈనేపథ్యంలో రెండునెలల క్రితం రెవెన్యూ అధికారులు సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వేనెంబరు 87/8లో ఎవరికి కూడా పట్టాలు ఇవ్వలేదని, ఇందులో ఎవరైనా ప్రవేశించినా, ఆక్రమించుకోవడానికి ప్రయత్నించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు.వీటిని అక్రమార్కులు పీకేశారు.

మండలంలోని ఖండ్రిగ గ్రామంలో ప్రభుత్వస్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామ పరిధిలోని 503–8లో వంక పోరంబోకు స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుని చదును చేసుకొన్నారు. మురాద్‌బీ కుంటకు వర్షపు నీరు చేరే ఈ వంకను ఆనవాళ్లు లేకుండా చేశారు. జేసీబీలతో వంకను ధ్వంసం చేసి ప్లాట్లు విక్రయించడానికి సిద్ధం చేసుకొన్నారు. దీంతో గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వోలు, సర్వేయర్లు రెండునెలల క్రితం వంకస్థలాన్ని సర్వేచేశారు. రూ. కోటి విలువచేసే మొత్తం 25 సెంట్ల మేరకు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేల్చారు. ఈనేపథ్యంలో రెవెన్యూ అధికారులు మురాద్‌బీ వంక వద్దకఆక్రమణ గురైన ప్రభుత్వంలో హెచ్చరిక బోర్డు నాటించారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని ఇక్కడ ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని అధికారులు హెచ్చరించారు.

హెచ్చరిక బోర్డులు మాయం

గుర్రంకొం మండలంలోని చిట్టిబోయనపల్లె, ఖండ్రిగ గ్రామాల్లో గతంల్లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మాయమయ్యాయి. రెండు చోట్ల బోర్డులను ఆక్రమణ దారులు తొలగించేశారు. అసలు అక్కడ హెచ్చరిక బోర్డులు ఉన్నట్లు ఆనవాళ్లు లేకుండా చేసేశారు. దీంతో రూ. 5 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు మళ్లీ కబ్జా చేసి, విక్రయించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.సదరు ప్రభుత్వస్థలాల్లో ఇప్పటికే అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టడం గమనార్హం. ఇంత తతంగం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అసలు రెవెన్యూ అధికారులు అలాంటప్పుడు ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు నాటడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

మళ్లీ మొదలైన కబ్జా యత్నాలు

ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు నాటిన తరువాత గుంభనంగా ఉన్న కబ్జాదారులు మళ్లీ ప్రభుత్వ భూములను కబ్జా చేసే యత్నాలు మొదలు పెట్టారు. బోర్డులు నాటిన భూముల్లో ఉన్న వేప, ఇతర చెట్లను నరికి వేశారు. ఇప్పటికే కొన్ని చెట్లను నేలకూల్చి తరలించేసి భూమిని చదును చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. సదరు భూమిలో చదును చేసే పనుల్లో భాగంగా బయట ప్రాంతాల నుంచి మట్టిని పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. మురాద్‌బీ వంకను చాలా వరకు చదను చేశారు. వంక రూపురేఖలు మార్చేసి ప్లాట్లు వేసి విక్రయించడానికి సిద్ధం చేశారు. దీంతో ఇక్కడ వంక ఆనవాళ్లు కనుమరుగయ్యాయి.ఇప్పటికే మట్టికుప్పలు భూమిలో దర్శనమిస్తుండడం గమనార్హం. రెవెన్యూ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకొని రోజురోజుకు భూ ఆక్రమణ పనులు మొదలు పెడుతుండటం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు తొలగించిన సంఘటనపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. చిట్టిబోయనపల్లె, ఖండ్రిగ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో మళ్లీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

– సదాశివప్ప నాయుడు, ఆర్ఐ. గుర్రంకొండ.

క్లుప్తంగా

మోటారు షెడ్డు కూల్చివేత

చిట్వేలి : చిట్వేలి గ్రామ పంచాయతీకి చెందిన మోటారు షెడ్డును సత్యమ్మ వీధికి చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసినట్లు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ఎర్రసానివారిపల్లెకు చెందిన సిద్దయ్య భార్య శివమ్మ (50) అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతోంది. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్థాపం చెంది సోమవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. అదే విధంగా అంగళ్లు గ్రామానికి చెందిన బాలరాజు భార్య వరలక్ష్మి(19) కుటుంబ సమస్యలతో మనస్థాపం చెంది పురుగుల మందుల తాగింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వరలక్ష్మి ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతుండగా, శివమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

కల్వర్టులో లారీ బోల్తా



సిద్దవటం కల్వర్టులో బోల్తాపడిన కట్టెల లోడు లారీ

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని స్విమ్మింగ్ పూల్ వద్ద ఆదివారం రాత్రి లారీ కల్వర్టులో పడిన ప్రమాదంలో నందలూరుకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులకు గాయాలయ్యాయి. లారీ కోడూరు నుంచి మామిడి కట్టెలు లోడు చేసుకొని ఆదివారం రాత్రి గోపవరంలోని సెంచురియన్ ప్లే ఉడ్ ఫ్యాక్టరీకి బయలుదేరింది. స్విమ్మింగ్ పూల్ వద్ద ఎత్తుగా ఉండటంతో అక్కడ డ్రైవర్ గేర్ మార్చుకోలేకపోవడంతో వెనక్కు వచ్చి కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శ్రీనివాసులకు గాయాలు కాగా స్థానికులు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

- సన్నిహిత సంబంధమే హత్యకు కారణం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఆయన కథనం మేరకు.. ఈ నెల 18వ తేదీ అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండల పరిధిలోని దేవళంపల్లె ఫారెస్టులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ వి. సుధాకర్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి అనుమానాస్పద మృతిగా భావించి కేసు నమోదు చేశారు. దర్యాప్తు వేగవంతం చేసి మృతురాలు మదనపల్లె మండలం, పాన్నేటిపాలెం, సవరంపల్లె గ్రామానికి చెందిన శ్రీదేవిగా గుర్తించారు. ఆమె ఫోన్ డేటా ఆధారంగా నిందితుడు సుండుపల్లె మండలం, మడితాడు గ్రామం నాయనివారిపల్లెకు చెందిన గురిగింజకుంట శివప్రసాద్ నాయుడుగా గుర్తించారు. మృతురాలితో నిందితుడు సన్నిహితంగా మెలిగేవాడని, ఈ క్రమంలో ఆమెను డబ్బుల కోసం వేధించేవాడని తెలుసుకున్నారు. దీంతో ఆమె తనతో ఉన్న సన్నిహిత సంబంధం గురించి అందరికీ చెబుతానని బెదిరించేది. డబ్బులు ఇవ్వకపోగా తననే బెదిరిస్తావా అని మనసులో కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె ఈ నెల 4వ తేదీ శివప్రసాద్ నాయుడుకు ఫోన్ చేసి తనను కలవాలని కోరింది. ఇదే అదనుగా భావించిన నిందితుడు ఆమెను బైకుపై మదనపల్లె నుంచి చిన్నమండెం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఆమె చీరను మెడకు చుట్టి ఊపిరాడకుండా చేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్నాక ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసును తీసుకున్నాడు. తర్వాత అప్పటికే తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పు పెట్టాడు. బంగారు గొలుసు సుండుపల్లెలోని కీర్తన ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి రూ.1,31,000 రుణం తీసుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారని తెలుసుకుని ఈ నెల 24వ తేదీ స్వచ్ఛందంగా లొంగిపోయాడు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటాద్రి, రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హత్య కేసు నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

రాయచోటి : జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణ, రవాణాను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 530 ఉన్నత పాఠశాలల్లో 430 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మందుల షాపులలో డాక్టర్ రాసిన చీటీలు లేకుండా మందులు ఇవ్వరాదని, తరచూ మందుల షాపులను తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో పోలీసు శాఖ వారికి ఇప్పటికే 735 అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. గంజాయి డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందడుగు, డ్రగ్స్ గంజాయి బానిసత్వం నుండి బయటకు రండి తదితర పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ జోగేంద్ర, డీఎస్పీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నియంత్రణపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

బాధితులకు చట్టపరిధిలో అండగా నిలవండి

రాయచోటి : న్యాయం కోసం పోలీసు స్టేషన్ గడప తొక్కిన బాధితులకు చట్టపరిధిలో అండగా నిలవాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలిచ్చారు. అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారుల సమస్యలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. సైబర్ మోసాలు, కుటుంబ సభ్యుల వేధింపులు, భూ వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు లాంటివి అధికంగా ఉన్నాయి. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా నేరుగా ఆదేశాలు జారీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళల ఫిర్యాదులకు ప్రాముఖ్యతనిస్తూ సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమ జంట

రాయచోటి టౌన్ : తమకు కుటుంబ పెద్దల నుంచి ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని ప్రేమ జంట జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును ఆశ్రయించారు. లక్కిరెడ్డిపల్లె మండలం ఎగువ బత్తినవారిపల్లెకు చెందిన మౌనిక, చిన్నమండెం మండలం నాగూరువాండ్లపల్లెకు చెందిన విజయ్ కుమార్ రెడ్డి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో పెద్దలను ఒప్పించి వివాహం చేసుకోవాలనుకున్నారు. అమ్మాయి ఇంట్లో అంగీకరించలేదు. దీంతో వారిని కాదని ఈ నెల 15వ తేదీన వీరు వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన అమ్మాయి తల్లిదండ్రులు చంపుతామని బెదిరిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఓబనపల్లి దళితవాడలో ఇంటి ముందు నిలిపి ఉంచిన కనుపర్తి రాజేంద్రకు చెందిన ఆటోను సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. పోలీసులు నిందితులను శిక్షించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

చేనేత నగర్‌లో చోరీ



బీరువాలు పగుల గొట్టిన దృశ్యం

కురబలకోట : మండలంలో చేనేత నగర్‌లోని ఎస్.బాషా ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటిలోని రూ.లక్ష నగదు, బీరువాలో దాచిన రూ.3 లక్షలు విలువ చేసే బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఎస్.బాషా కుటుంబీకులు ఆదివారం రాత్రి బ్రాహ్మణ ఒడ్డుపల్లె కాలనీలోని కూతురి ఇంటికి వెళ్లారు. ఇతని ఇళ్లు చేనేత నగర్ చివరలో ఉంది. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం పసిగట్టిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రెండు బీరువాలు పగుల గొట్టి వీటిని చోరీ చేశారు. సోమవారం ఉదయం బాషా కుటంబీకులు ఇంటికి వచ్చి చూసి నిశ్చేష్టులయ్యారు. ఇంటి పని ప్రారంభించడానికి బాధితుడు దాచిన రూ.లక్ష సొమ్ము దొంగల పాలు కావడంతో అతని ఇంటి కలలు ఆవిరయ్యాయి. సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదు నెలల వేతనం ఇవ్వాలి



జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

రాయచోటి : జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఎస్ఐపీఎఫ్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు రూ. 10 వేలు ప్రతి నెలా ఐదవ తేదీ చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సురేంద్రబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రీన్ అంబాసిడర్‌లకు కొన్ని పంచాయతీలు పూర్తిగా చెల్లించలేదన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవరాయులు, ఏవీ రమణ, అంజి, హరి, మురళీ, రెడ్డయ్య, సుభద్ర, లక్ష్మీదేవి, గంగులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21వ తేదీన జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎం.యేసుప్రియ, ఎస్.మన్సూర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రాజు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ సుస్మిత, పీఈటీ జగన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన ఎంపికలు

వేంపల్లె : స్థానిక శ్లోక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రాష్ట్రస్థాయి యోగాసన ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా ప్రెసిడెంట్ అనిల్, సెక్రటరీ తేజ పేర్కొన్నారు. సోమవారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీ ల్లో 70 మంది ట్రిపుల్ ఐటీ, కడప, పులివెందుల, తొండూరు తదితర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. విజేతలు సెప్టెంబర్ నెల 6, 7 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్తా, ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నిర్వహణ కోఆర్డినేటర్ పవన్ కుమా ర్, శ్లోక స్కూల్ కరస్పాండెంట్ నవనీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ సురేంద్ర విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ మనోహర్ రెడ్డి, టెక్నికల్ రిఫ్రికేశవ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట జిల్లా హామీని సీఎం నెరవేర్చాలి



సమావేశమైన జిల్లా సాధన సమితి జేఏసీ నేతలు

రాజంపేట : రాజంపేట జిల్లా ప్రకటనపై ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చాలని జిల్లా సాధన సమితి జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య అతిథి గృహంలో నేతలు భేటీ అయ్యారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాజంపేటలో ఇచ్చిన హామీ మేరకు రాజంపేటను జిల్లా చేయాలనే అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి జేఏసీ నేతలు పూల భాస్కర్, ఉద్దండం సుబ్రమణ్యం, గీతాంజలి రమణ, నందగోపాల్, జువ్వాజి మోహన్, సుదర్శన్, షేక్ అస్లాం, విద్యార్థి సంఘం నేత నాగేశ్వరనాయుడు, రమణనాయుడు, రఘుపతినాయుడు, పోకల ప్రభాకర్, మహదేవయ్య, డీఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న చెన్నారెడ్డి కాలనీలో గోగుల సురేఖ అనే మహిళ కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుంది. సురేఖ భర్త చిన్నబ్రహ్మం కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా సురేఖ కడుపు నొప్పితో బాధపడుతుండేది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సురేఖ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

భర్త, బంధువులు వేధిస్తున్నారని ఫిర్యాదు

కడప అర్బన్ : కడప నగరంలోని మరియాపురానికి చెందిన వసంతకు, కలికిరికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. వసంత, తన భర్తతోపాటు, అత్త, బంధువులు వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ టి.రెడ్డెప్ప తెలిపారు.

చిన్నారి మృతిపై అనుమానాలు

- కళాశాల సీసీ పుటేజీలో వెలుగు చూసిన వాస్తవాలు
- 13 రోజుల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం





శ్యామ్ కృష్ణ మృతదేహం (ఫైల్) నీటి నిల్వ తొట్టె

కురబలకోట : ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పొరుగింటి నీటి నిల్వ తొట్టిలో పడి చనిపోయాడని భావించి తల్లిదండ్రులు లేకలేక కలిగిన రెండేళ్ల పసిబిడ్డకు గుండె పగిలిన మనసుతో అంత్యక్రియలు నిర్వహించారు. దేవుడు మనకే ఎందుకు ఇంత క్షోభ మిగిల్చాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. కానీ అసలు కథ సీసీ కెమెరాల ద్వారా వెలుగు చూసింది. బిడ్డ ప్రమాదవశాత్తు చనిపోలేదని అనుమానాలకు దారితీసింది. దీంతో బిడ్డను పూడ్చిన 13 రోజుల తర్వాత సోమవారం తవ్వి తీసి అక్కడే డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. చిన్నారి తల్లిదండ్రులు, పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె బసినికొండకు చెందిన చిన్నరెడ్డెప్పకు, కురబలకోట మండలంలోని భార్గవికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల వరకు పిల్లలు కలుగకపోవడంతో ఎన్నో పూజలు, మొక్కుబడులు చేశారు. రెండేళ్ల క్రితం ఎం. శ్యామ్ కృష్ణ జన్మించాడు. లేక లేక కలిగిన ఆ బిడ్డను అల్లారు ముద్దుగా పెంచారు. ఈ క్రమంలో భార్గవి ఈనెల 11న పెద్దకటవలోని పుట్టింటికి భర్త, బిడ్డతో కలసి వచ్చింది. 12న ఉదయం రెండేళ్ల చిన్నారి శ్యామ్ కృష్ణ ఒంటరిగా ఆడుకుంటూ కొంత దూరంలో ఉన్న పొరిగింటి వైపు వెళ్లాడు. ఆ తర్వాత కన్పించకుండా పోయాడు. ఊరంతా వెతికారు. చివరకు గంట తర్వాత పొరిగింటిలో బయట ఉన్న నీటి తొట్టిలో శవమై కన్పించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. బిడ్డ ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని భావించి అదే రోజు బాధాతప్త హృదయంతో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటికి అనుమానం ఉంటే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పినా పసిబిడ్డకు పోస్టుమార్టం సరికాదని తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. రెండు రోజుల తర్వాత ఆ ఊరిని ఆనుకుని ఉన్న కళాశాల కెమెరాలను పరిశీలించారు. బిడ్డ పొరిగింటి వరకు వెళ్లడం అదే సమయంలో కొంత సేపటికే అదే ఊరికి చెందిన ఓ జంట ఆ ఇంటివైపు రావడం తిరిగి వెళ్లడం దృశ్యాలు కన్పించాయి. ఒక వైపు బిడ్డ మరో వైపు జంట పొరిగింటి వైపుగా వెళ్లినట్లుగా ఉన్న దృశ్యాలు మాత్రమే సీసీ కెమెరాలో కన్పిస్తున్నాయి. దీంతో అనుమానాలకు ఆస్కారం ఏర్పడింది. కథ ఒక్కసారిగా మలుపు తిరిగింది. తల్లిదండ్రులు బిడ్డ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే బిడ్డ మృతిపై ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. దీంతో రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో తహసీల్దారు ధనుంజయులు సమక్షంలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. ఇదిలా ఉండగా ఇప్పటికే భూమిలో పాతిపెట్టిన అమాయక పసిబిడ్డ మృతదేహాన్ని 13 రోజుల తర్వాత వెలికితీసి పోస్టుమార్టం చేసిన దృశ్యాన్ని చూసి తల్లిదండ్రులు, గ్రామస్తులు పొంగుకొస్తున్న దుంఖాన్ని ఆపుకోలేకపోయారు. అమాయక ప్రాణానికి న్యాయం జరగాలని తలచుకున్నారు. అంగళ్లు గ్రామ పంచాయతీ వార్డు మెంబర్, సోషల్ వర్కర్ తుమ్మచెట్లపల్లె నాగరత్న పాల్గొన్నారు.

శ్రీ గంధం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దవటం : పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో సోమవారం పహారా నిర్వహిస్తుండగా శ్రీగంధం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేశామని ఇద్దరు పరారయ్యారని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం భాకరాపేట సెక్షన్ సిబ్బంది పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో పహారా నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు శ్రీగంధం దుంగలతో వెళ్తూ కనిపించారన్నారు. అటవీశాఖ సిబ్బంది వారి వెంటపడగా ఇద్దరు పరారయ్యారని ఒకరిని పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తి చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్. విశ్వనాథమ్‌గా గుర్తించామన్నారు. పరారైనవారిలో చిత్తూరు జిల్లాకు చెందిన కొత్తకోట సురేంద్ర, చంద్ర అనే వ్యక్తులు ఉన్నారని చెప్పారు. ఐదు శ్రీంగంధం దుంగల బరువు 8 కిలోలు ఉందని అవి 21 వేల 589 రూపాయలు విలువ చేస్తాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పట్టుబడిన నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు. పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట సెక్షన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసులు, కె.జి. పెంటా బీట్, ఫారెస్ట్ బీటు ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ రాజు, భాకరాట బీటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.ఇంద్ర, భాకరాపేట బీటు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ జి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : బైక్ అదుపు తప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగంవారిపల్లె పంచాయతీ కొత్తకొండసానివారిపల్లెకు చెందిన బాలకృష్ణ కుమారుడు నవీన్(25) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో నిమ్మనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని చిన్నల్లవారిపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితికి వెళ్లగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.



ఆటో బోల్తాపడి తీవ్రంగా గాయపడిన మహేశ్వర

ఆటో బోల్తా పడి ..

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పుంగనూరు మండలంలో జరిగింది. నేతిగుట్లపల్లెకు చెందిన మహేశ్వర(40) మరి కొందరితో కలిసి ఆటోలో పుంగనూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలోని రాంపల్లి వద్ద ఒక్కసారిగా కుక్కలు అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మహేశ్వరతో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. కొందరు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా తీవ్రంగా గాయపడిన మహేశ్వరను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి

రాజంపేట : పుల్లంపేట మండలంలో యథేచ్ఛగా సాగుతున్న భూ ఆక్రమణలను అడ్డుకొని పేదలను ఆదుకోవాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏఓ శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందజేసిన అనంతరం కబ్జా భూముల వివరాలను ఎంపీపీ మీడియాకు వివరించారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం గ్రామంలో ముద్దా సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మినరసమ్మ పేరు మీద 324 సర్వే నెంబరులో 3 సెంట్లు స్థలం ఉందన్నారు. ఈ 3 సెంట్ల స్థలాన్ని ఆసరాగా తీసుకొని వీరి కుమారుడు ముద్దా సుభాష్‌రెడ్డి అలియాస్ గంగిరెడ్డి సమీపంలో పలువురి భూములను 40 ఎకరాల వరకు ఆక్రమించుకున్నారన్నారు. ఇదే విషయంపై పుల్లంపేట తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఇందులో ఉన్న గ్రామ కంఠం భూమి 6 ఎకరాలను కూడా కబ్జా చేశారని ఆరోపించారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. వెంబులూరు సుబ్బన్న, చెన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి వంటి వారితో పాటు ఎంతో మందిని ఇబ్బంది పెట్టి వారి భూములను ఆక్రమించుకున్నారన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరికి బంధువు కావడంతో రెచ్చిపోయి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దళితుల భూములకు అండగా ఉండాల్సిన పుల్లంపేట తహసీల్దార్ అధికార పార్టీ నాయకులకు, ఆక్రమణదారులకు వత్తాసు పలకడమేమిటని ఆయన ప్రశ్నించారు.



ఏఓ శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందజేసి వివరాలు తెలుపుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి

రాజ్యసభ సభ్యుడు మేడాపై దుష్ప్రచారం శోచనీయం

రాజంపేట : రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిపై ఎల్లోమీడియా, కూటమి ప్రభుత్వ అనుకూల ఛానళ్లు దుష్ప్రచారం చేయడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి అన్నారు. సోమవారం తన స్వగృహంలో ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే మేడా కుటుంబానికి ఎంతో అభిమానం ఉందన్నారు. ప్రాణం ఉన్నంత వరకు, రాజకీయాలలో మేడా రఘునాథరెడ్డి కుటుంబం జగన్‌రెడ్డిని వీడి వెళ్లరని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేయాలని భావించే వ్యక్తి మేడా రఘునాథరెడ్డి అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేసే విధంగా పాలన సాగించాలే కానీ తమకు అనుకూలమైన మీడియా ద్వారా మేడాపై బురదచల్లే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం తగదు

పీలేరు : ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కూటమి ప్రభుత్వానికి నిర్లక్ష్య ధోరణి తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్, కోశాధికారి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పీలేరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. పీఆర్సీ అమలు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాతన పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చెంగల్‌రాయుడు, ఆదినారాయణ, వెంకటరమణ, విజయ్‌కుమార్, పీరయ్య, చిన్నరెడ్డెప్ప, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాబిర్